పశు వైద్యం.. ధైన్యం

- అటెండర్లతోనే నెట్టుకొస్తున్న వైనం
- వైద్యుడు లేక గొర్రెల కాపరులు అవస్థలు
- మృత్యువాత పడుతున్న పశువులు



పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్య శాల

పెద్దకొత్తపల్లి: మండలంలో పశువులకు, జీవాలకు వైద్యం చేసే వారే కరువయ్యారు. రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో కాపరుల నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు సాతాపూర్, ముష్టిపల్లి, కల్వకోలు, మారేడుమానుదిన్నె పశువైద్య శాలలకు డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఐదుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా రెగ్యులర్ డాక్టర్ నియమించలేదు. స్టాక్పర్లు, మందులు అందుబాటులో లేకపోవడంతో కాపరులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్‌లో మందులను కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఇన్‌చార్జ్ వైద్యులే దిక్కు

మండల పశువైద్యశాలకు రెండు సంవత్సరాల నుంచి రెగ్యులర్ డాక్టర్ లేక ఇన్‌చార్జ్ డాక్టర్లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం పెద్దకొత్తపల్లి పశువైద్య శాలకు డాక్టర్ అనూషరావు ఇన్‌చార్జ్ కొనసాగుతున్నారు. అదేవిధంగా సాతాపూర్, ఎత్తం, కోడేరు, పెద్దకొత్తపల్లి నాలుగు పశువైద్యశాలలకు కూడా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాతాపూర్‌లో ఉన్న పశువైద్యాధికారి ఇటీవల బదిలీపై వెళ్లారు. అక్కడ రికార్డు అసిస్టెంట్ వైద్యం చేస్తున్నారు. ముష్టిపల్లి పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. అక్కడ పశువైద్య శాల లేకపోవడంతో ఆయన పెద్దకొత్తపల్లిలో పనిచేస్తున్నాడు. మండలంలో ఆవులు, గేదెలు 50 వేలు, గొర్రెలు, మేకలు 60 వేల వరకు ఉన్నాయి. రెగ్యులర్ డాక్టర్లను నియమించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రైతులు, కాపారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

జీవాలకు, పశువులకు సకాలంలో వైద్యం అందేలా కృషి చేస్తున్నాం. రెగ్యులర్ వైద్యుడు లేక కాపరులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తేనే రెగ్యులర్ డాక్టర్‌ను నియమించే అవకాశం ఉంది. పశువైద్యశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– జ్ఞానేశ్వర్, జిల్లా పశువైద్యాధికారి

జీవాలకు వైద్యం అందడం లేదు



మండల కేంద్రంలో ప్రభుత్వ పశువైద్య ఆస్పత్రి ఉన్నా వైద్యుడు లేదు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో గొర్రెలు, మేకలకు రోగాలు సోకినపుడు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులతో వైద్యం చేయించుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– మల్లయ్య, గొర్రెల కాపరి, పెద్దకొత్తపల్లి

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



ప్రభుత్వ పశువైద్యశాలలో సరైన వైద్యం అందడం లేదు. గోపాలమిత్రతో పశువులకు వైద్యం చేయించుకుంటున్నాం. వాటికి సరియైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. జీవాలకు రోగాలు వస్తే ఏం చేయాలో తెలువడం లేదు. ఇప్పటికైనా రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి.

– జంపయ్య, రైతు, పెద్దకొత్తపల్లి

క్లుప్తంగా

నేడు మోడల్‌స్కూల్ స్పాట్ అడ్మిషన్లు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చేరేందుకు విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు ఏర్పాటు చేశామని 6వ తరగతి నుంచి 9వ తరగతిలో చేరే వారు పాల్గొనాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయం వరకు కొనసాగుతుందని వివరించారు. మోడల్ పాఠశాలలో పిల్లను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోడేరు: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవేంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను సెల్: 9885765688 లో సంప్రదించాలని కోరారు.

వాహనాల వేలం ద్వారా రూ.72 వేల ఆదాయం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద పలు కేసుల్లో పట్టుబడ్డ 7 ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహించారు. వేలంలో పలువురు పాల్గొని రూ.72,892కు వాహనాలకు దక్కించుకున్నారు. ఈ మొత్తానికి అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి వెల్లడించారు. సారా, కల్తీ కల్లు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి చేయూత



కల్వకుర్తి రూరల్: మండలంలోని లింగసానిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, హనుమాన్ దేవాలయానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆర్థికసాయం అందించారు. ఆయన సమకూర్చిన రూ.20 వేలు బుధవారం మాజీ మార్కెట్ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్దన్, కాటన్ మిల్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బావాండ్ల మధు, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, కిరణ్ కుమార్, శేఖర్ రెడ్డి, శ్రీను, చారి, సత్యం పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతి

చారకొండ: రానున్న స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ దివ్యాంగుల జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఛత్తీస్‌ఘడ్, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా పంచాయతీ, పరిషత్‌లో నామినేటెడ్ పదవులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సైదులు, గోపయ్య తదితరులు ఉన్నారు.

ఆర్డీఓకు సన్మానం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీను నాయక్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో బుధవారం సన్మానించారు. పదోన్నతిపై నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా వెళ్తున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బండేల రామచంద్ర రెడ్డి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి



తెలకపల్లి: వరిసాగులో వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలో రాకొండలో రైతు రంగినేని అమరేందర్‌రావు అవగాహన కల్పించారు. ఖర్చులను తగ్గించుకోవాలని దిగుబడిని పెంచుకోవాలని కోరారు. అదేవిధంగా ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిని నర్మద ఉన్నారు.

'దళితులపై దాడులు పెరుగుతున్నాయి'

నాగర్‌కర్నూల్ రూరల్: దళితులపై దాడులు అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ముభరత్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో దళితుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్య, టాగురు, పరశురాములు, రాము, భీమయ్య పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పూర్తి చేయాలని నిరసన


తిమ్మినోనిపల్లిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో బుధవారం బీఆర్ఎస్ నాయకులు గండికోట రాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకర వేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బీటీ నిర్మించలేదన్నారు. కంకరరోడ్డుతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రివేళలో వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలబారిన పడుతున్నారని వాపోయారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం చేయడంతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు.

పదిలో ప్రతిభ కనబరిస్తే విమాన ప్రయాణం

తిమ్మాజిపేట: వచ్చే ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఉచిత విమాన ప్రయాణం సౌకర్యం కల్పిస్తానని మండల మాజీ ఉపాధ్యక్షుడు అచ్యుతారెడ్డి అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా మండలంలోని గొరిట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంపాక్ట్ సంస్థ మోటివేషనర్ జానకి రాంరెడ్డి జామెట్రి బాక్స్‌లు, ఇతర విద్య ఉపకరణాలు అందజేశారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, హెచ్‌ఎం గోవిందప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృతి

వంగూరు: గ్రామానికి చెందిన రాజగోపాల్ సంబంధించిన రెండు ఆవులు బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. స్థానికుల వివరాల ప్రకారం గ్రామ శివారులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఆవులు గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్ తెలిపారు.

బేస్ క్యాంపు వాచర్‌కు ఎక్సలెన్స్ అవార్డు

కొల్లాపూర్ రూరల్: పులుల సంరక్షణకు కృషి చేస్తున్న సిబ్బందికి అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జూలై 29న అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కొల్లాపూర్ రేంజ్ నుంచి ఎర్రపెంట సెక్షన్ జాలిపెంట బేస్ క్యాంపులోని మొలచింతపల్లి గ్రామానికి చెందిన మిర్యాల దర్గయ్య బేస్ క్యాంపు వాచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన సీఎఫ్ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఎఫ్‌డీఓ ఫ్లయింగ్ స్క్వాడ్ రామ్మోహన్ బుధవారం మన్ననూరులో అవార్డును అందజేశారు. బేస్ క్యాంపు సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



అచ్చంపేట రూరల్: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కొర్ర శంకర్ డిమాండ్ చేశారు. ఆగస్టు 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం అచ్చంపేటలో విడుదల చేశారు. రాములు, బాబురావు, రామకృష్ణ, బిచ్యానాయక్, ధన్‌సింగ్, రహీం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కల్వకుర్తి రూరల్: బీజేపీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు రహమతుల్లా పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తాండ్రలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. 128వ బూత్ అధ్యక్షుడిగా వెంకటయ్య, 129వ బూత్ అధ్యక్షుడిగా రంగన్న ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందించారు. సీనియర్ నాయకుడు మల్లేష్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో శిశువు ఆరోగ్యం

ఉప్పునుంతల: వ్యాక్సినేషన్‌తో శిశువు ఆరోగ్యంగా ఉంటాడని వైద్యాధికారిణి స్వప్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో చిన్నారుల టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ శిశువుకు టీకా వేయడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సంఘటన్ సమావేశానికి తరలిన నాయకులు

కల్వకుర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్‌కు కల్వకుర్తి డివిజన్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. పార్టీ పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మల్లేపల్లి జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస రెడ్డి, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మోతీలాల్ నాయక్, చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, పుస్తకాల రాహుల్, కుడుముల చంద్రకాంత్ రెడ్డి, బండి సుదర్శన్ తదితరులు వెళ్లారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్: స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని కార్యకర్తలకు డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో నాగర్ కర్నూలు జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు చత్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆర్‌జీపీఆర్ఎస్ స్టేట్ కో–ఆర్డినేటర్ కిరణ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తోపాటు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

వంగూరు: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఆరుగ్యారంటీలు పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ బ్రహ్మాచారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, క్యామ మల్లయ్య, సురేందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

లింగాల: మండలంలోని మల్లానిచెర్వుతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కిషన్‌నాయక్ వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

తిమ్మాజిపేట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ సత్యనారాయణ శెట్టి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థినులకు కావల్సిన నోట్ పుస్తకాలు, డ్రస్సులు, దుప్పట్లు, ఉచిత వసతి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. 6 వతరగతి, ఇంటర్ విద్యార్థినులు 70 మందికి ఉలెన్ బెడ్‌షీట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకధికారి సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

తెలకపల్లి: అతిథి ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీధర్‌శర్మ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో గురుకుల కళాశాలను సందర్శించి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ శర్మ, మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ గెస్టు టీచర్లకు, అవుట్ సోర్సింగ్‌లను రెగ్యులర్ చేసి టైం స్కేలు అమలు చేయాలన్నారు. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ కావడం విషాదకరం అన్నారు. కొత్త టెండర్లు వేసి నాణ్యమైన సరుకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, జిల్లా కర్యాదర్శి చంద్రశేఖర్, రమేస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని గురుకుల పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో హకీంకారి శంకర్, మహిమూద్, చటమోని కురుమయ్య, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల నారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

అచ్చంపేట రూరల్: వినూత్న రీతిలో విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధనోపకరణాలతో అర్థవంతమైన బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్‌ను బుధవారం బీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రాథమిక స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని బీటీఎఫ్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధార్థ, రవిందర్, కరుణాకర్, రాజు, శ్రీనివాసులు, భూపతి కుమార్, వెంకటేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

కోడేరు: మండలంలోని రేకులపల్లి తండాకు చెందిన మాజీ సర్పంచ్ కేతావత్ లాలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. వివిధ పార్టీల నాయకులు ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఆమె సేవలను కొనియాడారు.

వాల్‌పోస్టర్ విడుదల

తెలకపల్లి: మండలంలోని ఆలేరులో సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్ బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ జిల్లా మహాసభలు ఆగస్టు 1,2 తేదీలలో కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ ఆరోపించారు. స్థానిక లక్ష్మణాచారి భవనంలో బుధవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మధు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో గురుకులాల్లో సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గోరటి నరేష్, ప్రేమ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీవాలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు



తాడూరు: జీవాలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తునట్లు వైద్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు బలాన్‌పల్లిలో జీవాలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, ఆయా పెంపకందారులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండలంలోని గొరిట, ఆవంచ గ్రామాల్లో గొర్రెలలో నీలి నాలుక వ్యాధి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 581 గొర్రెలకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ శ్రావణి, మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, ఎల్ఎస్ఏ తిరుపతయ్య, జేవీఓ విజయ లలిత, అమీర్, యాదగిరి, శాంతయ్య, రవి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



మన్ననూర్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పంచాయతీ కార్యదర్శి భీముడు భూమి పూజ చేశారు. నిబంధన ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రహీం, వెంకటరమణ, సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, సైదులు, రాజారాం, శివాజీ, నిరంజన్, ప్రతాప్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ కాన్పులు


ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ రవికుమార్

తిమ్మాజిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ కాన్పులు చేస్తారని జిల్లా వైద్య ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాలు, వాక్సిన్, ల్యాబ్‌లకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ సుష్మ, డాక్టర్ ఇస్మాయిల్, ఫార్మసీ ఆఫీసర్ బాల్‌రాజ్, ఎంపీహెచ్ఎస్ మణికుమారి, స్టాఫ్‌నర్సు రోజులిన్ ఉన్నారు.

వేగవంతంగా జాతీయ రహదారి పనులు


పెద్దకొత్తపల్లిలో కొనసాగుతున్న సైడ్ కాల్వ పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి రోడ్డు పనులు పూర్తికావొచ్చాయి. మండల కేంద్రంలో సైడ్ కాల్వల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కల్వకుర్తి నుంచి 167 కే జాతీయ రహదారి పనులు ఏడాది కిందట ప్రారంభం కాగా ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు కల్వకోలులో రోడ్డు పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. తాడూరు బైపాస్ రోడ్డు పనులు నాగర్‌కర్నూల్, ఇటిక్యాల బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు యంత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొల్లాపూర్ నుంచి కల్వకుర్తి మీదుగా హైదరాబాదు వెళ్లేందుకు సమయం ఆదా కానుంది.

కస్తూర్బాగాంధీ పాఠశాల బియ్యం పక్కదారి?



పెంట్లవెల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు సరఫరా అయిన బియ్యం పక్కదారి పడుతున్నాయి. బుధవారం ఓ ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా స్థానికులు గమనించి ఆటో వివరాలు సేకరిస్తుండగా వారి కళ్లు గప్పి అక్కడినుంచి పరారయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికులు పాఠశాల సమీపంలో ఉన్న రైతు వేదిక దగ్గరకు వెళ్లి రైతుభరోసా గురించి అధికారులను సంప్రదించారు. పక్కనే ఉన్న ఆటోలో రైస్ బ్యాగులు ఉంచడంతో ఆటో దగ్గరకు వెళ్లారు. బియ్యంపై చెత్తవేసుకునే సంచులు, డ్రమ్ములు ఇతర దుప్పట్లు బియ్యం బస్తాలపై కప్పి ఉంచడంతో అనుమానంతో నిలదీశారు. ఇందులో ఏమి లేవని మాయామాటలు చెప్పి అక్కడి నుంచి మెల్లిగా ఆటోతో జారుకున్నాడు. ఈ విషయాన్ని జిల్లా కస్తూర్బా గాంధీ డీసీడీఓ శోభారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై డీసీడీఓను వివరణ కోరగా బియ్యంలో పురుగులు ఉండడంతో కస్తూర్బా పాఠశాలలో రోజు మిగిలి ఉన్న అన్నం, వ్యర్థపదార్థాలు కూరగాయలు తీసుకెళ్లే ఎరుకలి కులస్తుడికి ఉచితంగా ఇచ్చినట్లుగా ఎస్‌ఓ చెప్పారని తెలిపారు. కమిటీ వేసి విచారణ చేపడుతామని పేర్కొన్నారు.